# కవితా ఓనమాలు

## డిగ్రీ విద్యార్థుల కవితా సంకలనం

*సలహాదారులు*

**ఆచార్య ఉషా మునిపల్లె**
చైర్ పర్సన్

**జె.ఎస్. సుధాకరుడు**
కరస్పాండెంట్ సెక్రటరి

**డా. కె. ఝాన్సిరాణి**
అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్రిన్సిపాల్ I/C

**ఆచార్య ఎ. నకులా రెడ్డి**
డైరెక్టర్

*సంపాదకులు*

**అలివేణి మబ్బు**
అధ్యక్షులు, తెలుగు శాఖ

**తెలుగు శాఖ**
**ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ & సైన్స్ మహిళా కళాశాల**
**ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్**

**కవితా ఓనమాలు**

*డిగ్రీ విద్యార్థుల కవితా సంకలనం*


**తెలుగు శాఖ**

**ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ & సైన్స్ మహిళా కళాశాల**

ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్

---

ముద్రణ : ఏప్రిల్, 2022

ప్రతులు : 500

వెల : రూ. 75/-

**ప్రతులకు :**

తెలుగు శాఖ

ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ & సైన్స్ మహిళా కళాశాల

ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్

సెల్ : 8919733400

email : maamsdc@gmail.com

**లే అవుట్ :**

అక్షర గ్రాఫిక్స్ (ఉపేందర్)

నల్లకుంట, హైదరాబాద్.

సెల్ : 90104 44935

ముద్రణ :

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| * | తొలి అడుగులు - ఆచార్య ఉషా మునిపల్లె | 7 |
| * | అక్షర రూపం - డా. కె. ఝాన్సీరాణి | 9 |
| * | విద్యాదాత నా దైవం - డా.పి. లలిత వాణి | 11 |
| * | ఓనమాల తోట - డా. ఎన్. రజని | 13 |
| * | అక్షర మాల - ఎం.అలివేణి | 15 |
| 1. | ఓటు విలువ | 17 |
| 2. | భవిత మరిచిన యువత | 19 |
| 3. | నువ్వు | 20 |
| 4. | కన్నీటి వర్షం | 22 |
| 5. | కవితా ప్రవాహం | 23 |
| 6. | నాన్న | 24 |
| 7. | అదే కదా జీవితం | 26 |
| 8. | మానవా మారవా?? | 27 |
| 9. | అమ్మ | 28 |
| 10. | స్నేహం కోసం | 30 |
| 11. | అమ్మ | 31 |

12. అన్న దాత సుఖీభవ 32
13. నాన్న 33
14. ఇదే నేటి సమాజ పరిమాణం 34
15. అన్నయ్య 35
16. అమ్మ ప్రేమ 36
17. కాలమా ఆగుమా! 37
18. గెలుపు 38
18. చరవాణివో, శిరోభారానివో 39
19. అమ్మ 40
20. ఘర్షణ 41
21. చిరునవ్వు 42
22. చెలిమి 43
23. తమ్ముడు 44
24. తన పేరే ప్రేమ 45
25. ధైర్యమే ఆదర్శం 46
26. నది 47
27. నా నేస్తం 48
28. అమ్మ 49
29. నాతో -నేను 50
30. నాన్న 51
31. పువ్వు 52
32. ప్రకృతి 53
33. నాన్న 54
34. పూలతో 56

35. ప్రియ నేస్తమా ! 57
36. ప్రేమతో జీవిద్దాం 59
37. బాధ్యత మరచిన బంధాలు 60
38. గురువేమిన్న 61
39. బూస్టు 62
40. మధుర క్షణాలు 63
41. లైక్ 64
42. రైతు 65
43. విద్య 67
44. కుటుంబం 68
45. విజయం 69
46. సమయాన్ని కేటాయిస్తే 70
47. స్నేహం 71
48. స్త్రీ 72
49. తీయనైన స్నేహం 73
50. అమ్మ ఒడి 74
51. ఓ కాలమా 75
52. అమ్మ ప్రేమ అనంతం 76
53. కృష్ణ 77
55. నిరీక్షణ 78
56. అమ్మా 79
57. ప్రకృతి - చెప్పింది 80

# సహాయకులు

జీవితంలో అన్నింటి కన్నా విలువైనది, బలమైనది, చైతన్యపరచేది, సమాజంలో విలువను చేకూర్చేది, విజ్ఞానాన్ని అందించేది "విద్య" అని, అది ఎంతో విలువైనది అని నమ్మే వ్యక్తి, ఇష్టాన్ని నిరుత్సాహపరచకుండా, ప్రోత్సహిస్తూ ముందుకు సాగాలని, విజయం చేకూరాలని ఆశిస్తూ ఎంతో ఇష్టంగా సహకరిస్తూ, విద్యార్థులు రాసిన ఈ పుస్తకానికి ఆర్థిక సహాయం చేస్తూ, ఈ కవితా సంకలనం తేవడంలో నైతికమద్దతును అందించిన నా భర్త సిహెచ్. భిక్షపతి (అసోసియేట్ ప్రొఫెసర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, శేరిలింగంపల్లి, హైదరాబాద్) గారికి కృతజ్ఞతలు..

**- అలివేణి మబ్బు**
అధ్యక్షులు, తెలుగు శాఖ
AMSASCW

**ఆచార్య ఉషా మునిపల్లె**
చైర్ పర్సన్
ఆంధ్ర మహిళా సభ
ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్.

# తొలి అడుగులు

ప్రపంచ విఖ్యాతి పొందిన కవులందరు లోకం కోసం స్పందించి అవేదించినవారే. విద్యార్థినిలు ఎన్నుకున్న అంశాలు 'అమ్మ', 'నాన్న'. అన్నయ్య, స్నేహం, రైతు, ప్రకృతి, విద్య, కుటుంబం, ఓటు విలువ, భవిత మరిచిన యువత, మొదలైనవి. వీటన్నింటిలో వారి ఉదాత్త అంతరంగ ఆవిష్కరణ కనిపిస్తున్నది. ఈ చిన్న కవితల్లో వారు వేసిన బుడిబుడి అడుగుల్లో విద్యార్థులు ఎన్నుకున్న అంశాలన్ని చదివేవారికి విశ్వాసం చేకూర్చేవిగా, జీవితం పట్ల మమతను పెంచేవిగా ఉన్నాయి.

"మాతా మిత్రం పితాచేతి స్వభావాత్ త్రితయం హితం కార్యకారణ తత్సాత్యేవ భవంతి హిత బుద్ధయః" అనే హితోపదేశం గుర్తుకొస్తున్నది. (తల్లి, తండ్రి, మిత్రులు, వీళ్ళేకదా ప్రతి ఒక్కరికి హితులైన వాళ్ళు.) లోతుగా పరిశీలిస్తే విద్యార్థుల జీవితానుభవం కనిపిస్తున్నది. వీరి సూక్ష్మ కవితల్లో నేనెప్పుడు చెపుతుంటాను. సామాజిక ఆర్ద్రత లేని చోట సామాజిక స్పృహ అనే వాదానికి అర్థం ఉండదని' అక్షరాలా ఈ లక్షణాన్ని కలిగి ఉన్న మన విద్యార్థులు కళాశాలకు గర్వకారణమే. వారిని సక్రమమైన మార్గంలో నడిపించే గురువు శ్రీమతి అలివేణి కి నా శుభాభివందనాలు... విద్యార్థులందరికి శుభాశిస్సులు. ఈ చిన్ని పుస్తకం విద్యార్థుల 'తొలిఅడుగుల' తో కూడుకున్న కవితల సంకలనం.

నోరు లేనివారికి గొంతును, దృష్టిలేని వారికి దృష్టిని, ఆలోచించలేని వారికి మనస్సుని, అనుభూతి లోపించిన వారికి ఒక హృదయాన్ని, ఇవ్వగలిగిన వారే నిజమైన మానవీయదృష్టి కలిగిన వారని నా విశ్వాసం. ఆ కోవకు చెందిన మన కళాశాల విద్యార్థులందరికి కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర, యాజమాన్యం తరపున అభినందనలు తెలియచేస్తూ, విద్యార్థినిలను ప్రోత్సహిస్తే వారు సాధించలేనిది ఏదీ ఉండదని, వారిని సన్మార్గంలో నడిపించే బాధ్యత మనందరి పైన ఉన్నదని సున్నితంగా గుర్తు చేస్తున్నాను ఈ సందర్భంగా...

సామాజిక ఆర్ద్రత, సమున్నత మానవతాదృష్టి ఈ కవితల్లో విద్యార్థుల ఆత్మఘోషలు వినిపిస్తున్నాయి. ఈ ఘోష చుట్టూ ఉన్న సమాజపు పోకడలనుంచి ఉద్భవించినవే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

విద్యార్థులందరికి గురువులకే గురువైన దుర్గాబాయమ్మ ఆశీస్సులు పుష్కలంగా లభిస్తాయని విశ్వసిస్తూ మీ శ్రేయోభిలాషి. కళాశాల చైర్ పర్సన్ శ్రీమతి ఉషా మునిపల్లె ముందుమాట వ్రాసే అవకాశం ఇచ్చిన శ్రీమతి అలివేణికి కృతజ్ఞతలు.

**డా. కె. ఝాన్సిరాణి**
అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్
అండ్ ప్రిన్సిపాల్ I/C
ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్.

# అక్షర రూపం

ఆంధ్ర మహిళా సభ డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఈ డిగ్రీ స్థాయిలోనే కవితలు రాసి "కవితా ఓనమాలు" అనే "కవిత సంకలనం"గా వస్తున్నందుకు వారిని హృదయపూర్వకంగా ప్రశంసిస్తున్నాను.

విద్యార్థులు వారి వారి మనసుల్లోని భావాలను, బంధాలను వారి వారి అవగాహనతో ఈ కవితల రూపంలో వ్యక్తపరిచారు. సమాజంలో ప్రతిరోజు వారి చుట్టూ జరుగుతున్న సంఘటనలను, వారు పొందుతున్న అనుభవాలను, చెప్తూ వారి కవితలకు అక్షర రూపం ఇచ్చారు. యువత వేసే అడుగు ఎంత ప్రాముఖ్యమైనదో అన్నదానికి నిదర్శనంగా "భవిత మరిచిన యువత "అనే కవితను నాగసుప్రియ తెలియజేసింది. ఓటు వేసేటప్పుడు జాగ్రత్త వహించకపోతే పొందే పరిణామం ఎలా ఉంటుందో, మనిషికి ఓటు ఆయుధం అని, బాధ్యతని, కర్తవ్యం అని, రాజ్యాంగ హక్కు అని, వేసే ఓటు దేశ దశ దిశ నిర్దేశమవుతుందని ఓటు విలువను తెలియజేసిన జుంబిడి గాయత్రి ఎంతో చక్కగా తన భావనను తెలియజేసింది.

ఎందరో విద్యార్థులు అమ్మా, నాన్నల ప్రేమబంధాన్ని, దాని అనుభూతిని గురించి, రాసిన కవితలు, తెగిపోని పేగుబంధాన్ని ఎంతగానో గుర్తుచేస్తున్నాయి.

'రైతులేనిదే కంచంలో మెతుకు లేదు' కానీ రైతన్న కంచంలో కష్టాలు, కన్నీళ్లు తప్ప ఏమీ లేవని, విద్యార్థులు రాసిన కవితలల్లో రైతు దేశానికి వెన్నెముక అని సామాజిక కర్తవ్యంగా రైతుల కష్టాల గురించి రాసిన "అన్నదాత సుఖీభవ"అనే అనూష కవిత దేశానికి రైతే రాజు అని తెలుపుతుంది. అస్తమిస్తున్న వెలుగు ఉదయించడానికే, ఆవిరి అవుతున్న నీరు వర్షించడానికే, ఓడిపోతున్న నువ్వు గెలవడానికే అని 'గెలుపు' గురించి ఎం. స్వర్ణ కవిత తెలుపుతుంది. విజయం, ఘర్షణ, చిరునవ్వు, ధైర్యమే ఆదర్శం లాంటి విద్యార్థులు కవితలు చాలా చక్కగా ఉన్నాయి. ఇలా అందరి కవితలు ఒక్కో ప్రత్యేకతను తెలిపాయి.

కవులు చెప్పినట్టుగా 'సాహిత్యం' అంటే హితాన్ని చేకూర్చేది, కాబట్టి మా విద్యార్థులు ఈ సమాజనిర్మాణంలో సాహిత్య భాగస్వాములు కావాలని, ఇంకా ఎన్నో కవితలు రాయాలని ఆకాంక్షిస్తూ మా తెలుగు విద్యార్థులను మరియు తెలుగు అధ్యాపకురాలు అలివేణిని, ఈ కరోనా కాలంలో కూడా కవితలు రాయాలనే ఆలోచనను కలిగించి ప్రోత్సహించి, వారిలో ఉన్న సృజనాత్మకతను ఈ పుస్తకరూపంలో తీసుకొస్తున్నందుకు ఈ కళాశాల ప్రిన్సిపల్‌గా వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

**డా. పి.లలిత వాణి**
పూర్వ విద్యార్థిని.
ఎం.ఏ., పి హెచ్ డి (తెలుగు)
ప్రిన్సిపల్ (రి).
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ళ, రంగారెడ్డి జిల్లా.
ఫోన్ నెం. : 9849026107.

# విద్యాదాత నా దైవం

"విద్యాదాత నా దైవం, విద్యాలయం నా దేవాలయం " అన్న కవి పలుకులు నా పట్ల అక్షరసత్యాలు. ఆంధ్ర మహిళా కళాశాల నా జీవితాన్ని మార్చేసి నాలో ఉన్నతస్థాయిని అందించింది. నేను ఇంటర్‌లో అత్తెసరు మార్కులతో మాత్రమే ఉత్తీర్ణురాలినయ్యాను. ఏ ముహూర్తాన కళాశాలలో అడుగు పెట్టానో కానీ నా బ్రతుకు కొత్త మలుపు తిరిగింది. చదువు మీద ధ్యాస, ఏకాగ్రత కుదిరాయి. అందుకు ప్రధాన కారకులు నా గురువులే. 1983లో నేను ఈ కళాశాల తరుపున మొత్తం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి, హెచ్.ఈ.హెచ్. నిజాం బంగారు పతకాన్ని సాధించగలిగానంటే కేవలం నా గురువుల బోధనా పటిమ, ఆశీస్సులే కారణం. ఈనాడు నేను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్థాయికి చేరుకోవడం - ఆది గురువు అయిన అమ్మ, ఆంధ్ర మహిళాసభ కళాశాల అధ్యాపకుల చలువ, వాత్సల్యం, నా మీద వారి ప్రత్యేక దృష్టి.

ఆ తరువాత ఈ నాటికి మళ్ళీ ఈ కళాశాలతో బంధం కలగడం నా పూర్వజన్మ సుకృతం. ఈనాటి తెలుగు శాఖాధ్యక్షురాలు అలివేణి గారు తమ విద్యార్థుల మీద కనబరుస్తున్న శ్రద్ధాసక్తులు నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి. ఇప్పుడిప్పుడే తెలుగు సాహిత్యంలోకి తొంగి చూస్తున్న యువతని ప్రోత్సహించి వారి చేత కవితా ఓనమాలు దిద్దించిన అలివేణి గారు బహుధా ప్రశంసనీయురాలు. ఒకరా ఇద్దరా వందకు పైగా

విద్యార్థినులచేత కవితారచన సాగించిన అలివేణి గారు ఈ కళాశాలలోని తెలుగు శాఖకే వన్నెతెచ్చారు. అసలే తెలుగు అని తక్కువ ప్రభావంతో పలికే సమాజం ఉన్న ఈరోజుల్లో ఇలా విద్యార్థినుల చేత మాత్రమే కవితలు రాయించి, వాటిని ముద్రించి ఒక మంచి పుస్తకంగా వెలుగులోకి తెచ్చి- "సాధనతో దేనినైనా సాధించవచ్చుని" నిరూపించిన అలివేణి గారిని అభినందిస్తున్నాను.

అలివేణి గారి శిష్య వాత్సల్యం ప్రశంసనీయం. బి.ఏ, బీ.ఎస్సీ, బీ.కాం లలోని అన్ని సెక్షన్స్‌కి చెందిన విద్యార్థినులను ఉత్తేజపరిచి, కవితా శక్తిని వెలికితీసారు. తారతమ్య భేదం లేకుండా ప్రతి ఒక్క విద్యార్థి వెన్ను తట్టారు. ఆ విద్యార్థులు పూర్వ పుణ్యం - ఇంత మంచి గురువు లభించడం. కళాశాల పేరు - ప్రఖ్యాతులకి, తెలుగుశాఖ అభ్యున్నతకి , విద్యార్థినులను ఉజ్వల భవితవ్యానికి ఇలాంటి గురువు ఎంతో అవసరం.

ఈ చిన్ని పుస్తకం మరింత మందిని ప్రభావితం చేసి - ఇన్నికిన్ని కవితలు, కవయిత్రులు వెలుగు చూడాలని ఆకాంక్షిస్తున్నాను.

**Dr. N. Rajani**
(MA.M.Phil. PHD)
Assistant Professor & Head,.
of Telugu Department.
Incharge director, WDEC.

Department of Telugu
Dr BR AMBEDKAR OPEN UNIVERSITY
Email: rajnellutla@gmail.com
Ph.: 9010501030

# ఓనమాల తోట

"కవితా ఓనమాలు" అనే పేరుతో ఒక మంచి కవితా సంపుటిని తీసుకొస్తున్నందుకు మొదట ఆంధ్ర మహిళా సభ విద్యార్థులను - వాళ్ళతో కవిత్వం రాయించాలనే తపనతో కవితాసంపుటి తెచ్చిన వాళ్ళ అధ్యాపకురాలిని (తెలుగు శాఖ అధ్యక్షురాలు అలివేణి గారిని) మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

ఇవి కవితా ఓనమాలు కాదు. ఓనమాలు అంటే అప్పుడే నేర్చుకుంటున్న అక్షరాలు. కానీ ఈ పిల్లలందరు కవిత్వంలో పండిపోయినట్టుగా రాసారు. నిజానికి నాకే కవిత్వంలో ఓనమాలు తెలియదు. కానీ ఈ బుల్లి బుల్లి కవులందరూ ముందు ముందు జీవితంలో మంచి కవులుగా, మంచి మనుషులుగా, మంచి సాహిత్య వేత్తలుగా ఎదగాలని నా ఆకాంక్ష.

ఈ సంపుటిలో మొత్తం 57 కవిత్వాలున్నాయి. విద్యార్థులందరూ వారి వారి మనసులోని భావాలను ఈ కవితల్లో చక్కగా ఆవిష్కరించారు. కవిత పరిమాణంతో కవిత్వాన్ని నిర్వహించలేము. ఒక చోట రెండు లైన్లు కావచ్చు, మరోచోట 20 లైన్లు ఉండొచ్చు. వారి మనసులో భావాలకు ప్రతిరూపం ఎంతైనా - ఆ ప్రతిరూపమే కవిత.

"నువ్వు వేసే ఓటే దశదిశలను నిర్దేశం చేస్తుంది" అంటుంది గాయత్రి తన ఓటు విలువ కవితలో. నేటి విద్యార్థులే భావిభారత పౌరులు అన్న మాటను నిజం చేస్తూ ఓటు విలువను ఎంతో స్పష్టంగా తెలుపుతుంది. "ఓటిచ్చునప్పుడే ఉండాలి బుద్ధి" అని కాళోజీ గారు చెప్పినట్టు ఓటు వేసేటప్పుడే భవిష్య దర్శనం ఉండాలనే సూచనతో ఈ కవిత్వం ముగుస్తుంది.

ఇంకో కవితలో నాగరికతను మరచిన యువతరాన్ని హెచ్చరిస్తూ వారి భవిష్యత్తును గుర్తుచేస్తోంది నాగ సుప్రియ.

మొత్తంగా ఇందులో కవితలు రాసిన విద్యార్థినులందరినీ పేరు - పేరునా అభినందిస్తున్నాను. అమ్మ నాన్నల ప్రేమ గురించి కవిత్వం, స్నేహానికి నిర్వచనాన్ని అందించే కవిత్వం, విద్యార్థులుగా తమకున్న సామాజిక బాధ్యతగా రైతన్నల కష్టాల గురించి రాసిన కవితలు - అన్ని కవితలూ వాటి వాటి పరిధిలో చాలా బాగున్నాయి. ఎవరో ఒకరిది బాగుండి, మరొకరిది బాలేదు అనే ఆలోచనే లేదు. దేనికదే ఒక ప్రత్యేకత. ప్రతి కవిత ఒక భావనను, ఒక సందేశాన్ని, ఒక నూతనత్వాన్ని మోసుకొచ్చాయి.

రమణి చెప్పినట్టుగా ఆంధ్రమహిళాసభ విద్యార్థులంతా కవితా సముద్రంలో విహరించారు. ఎన్ని పుస్తకాలు తెరిచి వెతకని నాన్న కష్టాన్ని ఎంత బాగా గమనిస్తుంది ఒక భూమిక - ఆకాశాన్ని అలుముకున్న మబ్బుల్లా.

కళ్ళల్లో ఒక నీటిపొర అంటే వర్షాన్ని కొత్త జీవితానికి నాందిగా చెప్తుంది. కన్నీరును పాత జీవితానికి స్వస్తిగా చెబుతుంది. ఆ కవిత చివరలో వర్షమైనా, కన్నీరైనా కొంతకాలమే మేలు అంటూ నిన్న, నేటికి పాత, నేడు, రేపుకు పాత అంటూ పాతదనానికి స్వస్తి చెపుతూ ఎల్లప్పుడూ కొత్తదనాన్ని ఆహ్వానించాలనే భావనను తన అక్షరాలతో ఎంతో అందంగా పలికిస్తుంది యశస్విని తన " కన్నీటి వర్షం" అనే కవితలో.

మన గమ్యం చేరేవరకు శ్రమించాలి, మన జీవితాన్ని గౌరవంగా నిరూపించుకోవాలి. "అదే కదా జీవితం" అంటూ ఎంతోమంది మేధావులకు కూడా అర్థం కానీ జీవిత నిర్వచనాన్ని చాలా సాదాసీదా మాటలతో మనకు అందిస్తుంది గౌతమి.

నిజానికి ప్రతీ కవితనూ ఇట్లా ఉటంకించవచ్చు. కానీ ఈ కవిత్వాన్ని పాఠకులందరికీ చదివి ఆలోచించే అవకాశం ఇవ్వడం కోసం "కొంతమంది యువకులు పావన నవజీవన బృందావన నిర్మాతలు" అని శ్రీశ్రీ గారు చెప్పినట్లు ఈ విద్యార్థులందరూ నవజీవన నిర్మాణంలో పాలుపంచుకోవాలని, సాహిత్యం సమాజానికి మేలు చేసే దిశగా వీరు కవిత్వం రాయాలని ఆకాంక్షిస్తూ ఈ చిన్నారి విద్యార్థులందరినీ ప్రత్యేకంగా అభినందిస్తూ, ఈ అక్షరాలలోకి, ఈ కవితల తోటలోకి, ఈ పువ్వుల లాంటి విద్యార్థుల అక్షరాల తోటలోకి మిమ్మల్ని స్వాగతిస్తున్నాను.

**ఎం.అలివేణి**
HOD తెలుగు శాఖ
ఏ.ఎం.ఎస్ కాలేజీ, OU
హైదరాబాద్

# అక్షర మాల

"పొడుస్తున్న పొద్దుమీద
నడుస్తున్న కాలమా "

అని గద్దర్ అన్నట్టుగా కాలంతో పోటీపడుతూ ఎదుగుతున్న విద్యార్థులు, దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలను అర్థం చేసుకుంటూ నూతన అభిప్రాయాలు చిగురిస్తున్న కాలమిది. ఒక్క సిరాచుక్క వంద మెదళ్ళను కదిలిస్తుంది అని కాళోజీ అన్నట్టుగా విద్యార్థులు తమ ఆలోచనా సరళిని, కలంలో నుండి కాగితాల పై బుడి బుడి కవితల అల్లికలతో హృదయాలను కదిలిస్తూ అక్షరమాలగా అవతరించిందే ఈ 'కవితా సంపుటి'.

16 నెలలు ఢిల్లీనీ చుట్టిముట్టి రాత్రనక, పగలనక రహదారులను దిగ్బంధం చేసి రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచెయ్యాలి అని పోరాడి విజయం సాధించిన రైతాంగం, ప్రభుత్వం అంటే పాలకులే కాదు ప్రజలు అని, ప్రజాస్వామిక సూత్రాన్ని ప్రత్యక్షంగా ఆవిష్కరించిన సందర్భమిది. మార్కెట్ పోటీలో భాగంగా బడా పెట్టుబడిదారి దేశాల మధ్య సాగిన ఆధిపత్య పోరులో మానవ మనుగడనే ప్రశ్నార్ధకం చేసిన మహమ్మారి కరోనా విలయతాండవం చేస్తున్న సమయం ఇది.

భౌతిక తరగతులకు దూరమై, ఆన్ లైన్ విద్య విధానంపై ఆధారపడి చదువుతున్న సందర్భంలో రాసిన కవితలివి.

"భూగోళం పుట్టుక కోసం
రాలిన సురగోళాలెన్నో
ఈ మానవ రూపం కోసం
జరిగిన పరిణామాలెన్నో"

అని దాశరథి కలం నుండి జాలువారిన కవిత్వం ప్రపంచాన్ని శాస్త్రీయంగా మేల్కొల్పింది.

అందుకే పిల్లల నుండి తమ సృజనాత్మకతను, మానసిక విలువలను పెంపొందించడానికి, మనిషిని, మనిషిగా గౌరవించేటటువంటి సమాజ నిర్మాణం పై సాగిన కవితలు కొన్నైతే, అవనిలో అమ్మ ప్రేమ అనంతం అని, ఈ సృష్టిలో అంతకు మించిన తియ్యదనం మరొకటి లేదు అని, తల్లికి, బిడ్డకు ఉండే పేగుబంధాన్ని చెప్పిన కవితలు కొన్ని. కులమతాలకతీతంగా మంచిని ప్రేమించే స్నేహానికై సాగిన కవితలు మరి కొన్ని. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించిన కవితలు కొన్ని. భవితను మరిచిన యువతరాన్ని మెల్కోలిపే కవితలు ఇంకొన్ని. ఇలా సాగిన విద్యార్థుల కవితల ప్రయాణం రంగవల్లై వెలిసిన 'కవితా సంపుటి' ఉన్నతమైన వ్యక్తిత్వం కల్గి, మహిళల అభ్యున్నతికై పాటుపడిన దుర్గాబాయ్ దేశముఖ్ స్థాపించిన 'ఆంధ్ర మహిళాసభ' ఆమె ఆశయాలను కొనసాగిస్తూ విద్యాసంస్థను నిర్వహిస్తున్న పాలక మండలి కృషి, అధ్యాపకుల బోధన విద్యార్థినులను చైతన్యపరుస్తూ, సామాజిక స్పృహను కల్గిస్తూ విద్యను అందిస్తుంది.

సెల్‌ఫోన్ లు, టీవీ లు, సోషల్ మీడియాలతో నిత్యం ఆకర్షితం అవుతున్న కాలంలో కూడా AMS కళాశాల విద్యార్థినీలు కవితల ప్రాముఖ్యతను, వాటి ప్రభావాన్ని ఆకళింపు చేసుకుని వివిధ అంశాలపైన తమ తమ భావాలను కవితల రూపంలో వ్యక్తపరిచిన అభిప్రాయాలే ఈ 'కవితా ఓనమాల సంపుటి'.

1

# ఓటు విలువ

పచ్చ నోటు కోసం
లిక్కర్ బాటిల్ కోసం
పూట బిర్యాని కోసం
నీ ఓటును నీవే అమ్ముకోకు

ఓటు ను  అమ్ముకుంటే
రోడ్డు సరిగ్గా లేకున్నా
స్ట్రీట్ లైటు వెలగకున్నా
గవర్నమెంట్ జాబ్ రాకున్నా
పక్క ఇళ్ళు కట్టించకున్నా

డ్రైనేజీ నిండినా
నల్లా నీళ్లు రాకున్నా
పెట్రోలు ధరలు పెరిగినా
బడి ఫీజు లు పెంచినా

గగ్గోలు పెట్టకు
దొంగల చేతులకు
రౌడీ ల చేతులకు

అవి-నీతి లంచ-గోండులకు
అధికారం ఇవ్వకు

ఓటు నీ హక్కు,
ఓటు నీ ఆయుధం
ఓటు నీ బాధ్యత
ఓటు నీ కర్తవ్యం
నీవు వేసే ఓటే దేశ దశ దిశా నిర్దేశం
ఓటు రాజ్యాంగ హక్కు

పోరాడితే రాజువి అవుతావు
అమ్ముడు పోతే బానిసవు అవుతావు
ఓటు నవ సమాజ నిర్మాణానికి నాంది
రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరరక్షణకు పునాది

ఓటే సమ-సమాజ నిర్మాణం
నిజాయతి ఓటు దేశ గమనాన్ని మార్చేస్తుంది
అవినీతి నిర్మూలన ఓటూ తోనే సాధ్యం
ధర్మ పరిపాలనా ఓటుతోనే సుసాధ్యము

**జుంబిడి గాయత్రి**
*బి.కమ్ కంప్యూటర్ అప్లికేషన్స్*
*డిగ్రీ ఫైనల్ ఇయర్*

2

# భవిత మరిచిన యువత

తప్పని తెలిసీ తప్పతాగి తెగవాగేస్తుంటే ఎలా...?
ఓయూ రోడ్డుపైన ఆ జర్దాకిల్లి ఉమ్మేస్తుంటే ఎలా...?
అందమైన ఆ అనంతగిరి ప్రకృతి నీకై చేతులు చాస్తుంటే
విచక్షణను విడనాడి చెట్లను నరికేస్తుంటే ఎలా...?
శ్వాస మనిషికి ప్రాణం, గానం, ఆరోగ్యమనీ తెలిసీ
ఊపిరితిత్తులు కాల్చే సిగరేట్ ఊదేస్తుంటే ఎలా...?
ఏ. ఎం .ఎస్ కళాశాలల్లో మంచి చదువుందని తెలిసీ
క్లాసుకు వెళ్లకుండా, గ్రంథాలయ గర్భగుడిలోకి ప్రవేశించకుండా వుంటే ఎలా...?
స్త్రీని దేవతగా పూజించే ఈ దేశంలో జన్మించి
చదువుకు, కొలువుకు వెల్లే మహిళను వేధిస్తుంటే ఎలా...?
మత్తు మనిషిని మృగాన్నీ చేసే ఎత్తుగడేనని తెలిసి
భవిత మరిచి ఈ యువత డ్రాగ్స్ కై పడిచస్తుంటే ఎలా...?
శ్రీశైలవాస.! ఈ గతిని మార్చడం నీ తరమా నా తరమా...?
బాధ్యత మరచి ఎవరికి వారే దాటేస్తుంటే... ఎలా... ఎలా...?

**వి. నాగ సుప్రియ,**
*బి.కామ్ (జనరల్) ఫైనల్ ఇయర్*

3

# నువ్వు

నా ఆశలకు ఆయువు నువ్వు
నా ఊహకు ఊపిరి నువ్వు
నా కనులకు కలవరము నువ్వు
హృదయ సంద్రాన లయ నువ్వు
ఉషోదయాన సుప్రభాతము నువ్వు
నీలి గగనాన నెలవంక నువ్వు.
మదిలోని భావాలకు అక్షర భాష్యం నువ్వు
చెరగని జ్ఞాపకానికి  చిరునామా నువ్వు

నా ఆనందంలో నవ్వు నువ్వు...
నా ఊహల్లో చిత్రం నువ్వు...
నా గుండెల్లో చప్పుడు నువ్వు...
నేను అనే పదానికి అర్థం నువ్వు

కల చెదిరిపోయినా
కాలం ఆగిపోయినా
కొలను ఇంకిపోయినా
కుసుమం వికసించక పోయినా

కారు మేఘం కమ్ముకోకపోయినా
కడలి అల కదిలిపోయినా.
కడవరకు కలిసి ఉందాం.
స్నేహ కుసుమాలు వికసింపచేద్దాం.

**బి. శృతి**
*బి.కామ్ (కంప్యూటర్స్)*

4

# కన్నీటి వర్షం

ఆకాశాన్ని అలుముకున్న మబ్బుల్లా?
కళ్ళలో ఒక నీటి పొర
ఆ మబ్బులు కరిగినపుడు వర్షం
బాధ తొలగినపుడు కన్నీరు
వర్షం భూమిపై భారాన్ని పెంచుతుంది
కన్నీరు మనసుని తేలిక చేస్తుంది
వర్షం కొత్త జీవితానికి నాంది
కన్నీరు పాత జీవితానికి స్వస్తి
కుండపోత వాన అన్నింటినీ ముంచేస్తుంది
ఆగని కన్నీరు జీవితాన్ని నిలిపేస్తుంది
వర్షం అయినా కన్నీరైనా కొంత కాలమే మేలు.

**ఎన్. యశశ్విని**
B.Sc, BZC

5

# కవితా ప్రవాహం

పదాలు నా మదిలో ప్రవహిస్తున్నాయి
నేను నా కవితా సముద్రం లో విహరిస్తున్నాను
నా లోని భావాలు లయ తరంగాలుగా వీస్తున్నాయి
నాలో కలిగిన ఈ చిన్ని ఆలోచన పేజీని నింపింది
ఆలోచన ఉప్పెన వలె నన్ను ముంచేస్తుంది
ఒక ప్రేరణా నన్ను ప్రవాహంలో చుట్టేసింది
ఓటమిని చూసి తల వంచే వాడు గెలవలేడు
గెలుపు ఓటముల గురించి ఆలోచించక
నిరంతరం శ్రమించేవాడే గెలుపును సాధిస్తాడు

**రమణి**
B.Sc, BZC

6

# నాన్న

నాన్న నీ ప్రేమకి ఆకాశమే హద్దు
అక్షరానికే అంతుచిక్కదు నాన్న
నీ సహనాన్ని వర్ణించడం.
నీ త్యాగాల పలితం ఈరోజు మా ఈ జీవితం
నీ అనుభవాలకు రూపం ,
మేము నడిచే మా ఈ జీవిత మార్గం.
మా నవ్వు వెనుక దాగివున్న
నీ కష్టాన్ని మాటలలో వ్యక్తపరచలేం నాన్న .
ఎన్ని పుస్తకాలు తెరచి వెతికినా దొరకదు నాన్న,
అనుభవాలతో నువ్వు చెప్పే పాఠంలోని సారం.
మా లక్ష్య సాధనకై నువ్వు చేసే కృషి,
పడే ఆరాటం ముందు,
ఎన్ని ప్రపంచ యుద్ధాలు ఐనా సరితూగవు నాన్న
ఎన్నో పదాల మధ్య నేను అంటే నేను అనే యుద్ధం జరుగుతుంది నాన్న,
నీ వంటి సహణశీలి గురించి,
ఈ లోకానికి తెలియజేయాలని.
నాన్న నీ వ్యక్తిత్వాన్ని వివరించి, నీ ప్రేమను వర్ణించాలని,
నా మనసు ఎంతో ఆరాటపడుతుంది,

కానీ ,నా మనసులో మాటలకు ఎలా ప్రాణం పోయాలో తేలియక
 అక్షరాలే అయోమయంలో పడిపోయాయి నాన్న.
ఎన్నో జన్మల పుణ్యఫలం ఈ మానవ జన్మ
అలాంటి ఈ జన్మలో నీ కూతురిగా పుట్టిన
నా ఈ జన్మ ధన్యం నాన్న.

**పి. భూమిక**

*Bsc (Bzc ) 3 rd year*

7

# అదే కదా జీవితం

అనుకున్నవి జరగాలని లేదు,
అనుకోనివి జరగకుండా ఆగవు
అలాంటప్పుడు అది కావాలి, ఇది కావాలి అని అనుకోవడం ఎందుకు?
అది మన అమాయకత్వం!
ఏదో కావాలి అనుకుంటే,
జీవితం మనకి ఏదో ఇస్తుంది.
అదే కదా మరి జీవితం అంటే!
అనుకున్నవి జరగకపోవడమే జీవితం.
అందుకే జీవితం మనకి ఏది ఇస్తే,
ఏ దారిని చూపిస్తే దాని ప్రకారంగానే
మన జీవిత ప్రయాణాన్ని కొనసాగించాలి!
మన గమ్యం చేరేవరకు శ్రమించాలి.
మన జీవితాన్ని గౌరవంగా నిరూపించుకోవాలి,
అప్పుడే మన జీవితం సఫలీకృతం అవుతుంది.

**-మామిడాల గౌతమి**
*బయోటెక్నాలజీ* 3rd year

8

# మానవా మారవా

మానవా మారవా??
ఓ మానవా......
నీ అరాచకత్వం ఇక  మానవా?
ఆడపిల్ల ఆటబొమ్మగా అగుపించెనా,
నిను కన్నది ఆడదని మరిచావా,
మగువలను బజారు సొమ్మని తలిచావా,
నీతో సహబుట్టిన సహోదరిని మరిచావా..?

యాసిడ్ దాడులతో బలాత్కారాలు,
మతి గతించి మానభంగాలు,
వావి వరుస లేని వర్తమాన సంఘటనలు...
మానవా మారవా??

**జి.యామిని**
*BSc (MSCs)*

9

# అమ్మ

తన హృదయం సెలయేరు దూకినట్టు...
తన నవ్వు - నెమలి పురివిప్పినట్టు...

తన పాట - మురళి మ్రోగినట్టు...
తన మనస్సు - సిరిమల్లె విరిసినట్టు...

తన చూపు - చిరుగాలి వీచినట్టు...
తన ఓర్పు - పుడమి మళ్లీ పుట్టినట్టు...

మా అమ్మప్రేమ కదిలే
పాశుపతాస్త్రం!
నన్ను కాపాడుతుంది
ఎక్కడ ఉన్నా
అనునిత్యం...!!

అమ్మ ప్రేమను దేనితో అయినా
పోల్చగలమా...?
మన మనసులో నుంచి

ఆ జ్ఞాపకాలు తుంచగలమా?
ఏమిచ్చినా రుణం
తీర్చగలమా...?

తన ఒడిలోనే రాజరికాన్ని చూపిస్తుంది..
తన మాటలతోనే మాధుర్యాన్ని కురిపిస్తోంది..
తన చూపుతోనే కడుపును నింపేస్తుంది...
ఒక నవ్వు తోనే మనసును మార్చేస్తుంది
తన చేతలతోనే ఈ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది

అందుకేనేమో...
ఆ పేరు పలికితే చాలు కడుపు నిండిపోతుంది..
రూపంలో దయావతి,,
ప్రేమను పంచే ప్రేమమూర్తి,,
మన జన్మకి దేవుడిచ్చిన ఒకే ఒక గొప్ప బహుమతి..!!

**బి. హారిక**
*Bsc (Mscs) 3rd year*

10

# స్నేహం కోసం

అనుకోని మన పరిచయం
అనుగుణంగా మార్చుకున్న ప్రతి క్షణం
నీతో ఉండాలి అన్న నా ప్రాణం
ఎన్నటికీ విడలేను నీ స్నేహం
ప్రేమని పంచి
కోపాన్ని విడిచి
నాలోని ఇజాన్ని అణచి
నా కోసం నీ అలవాటు మరిచి
నాలో సగమై నిలిచావు
ఓ నేస్తం
మన అనుబంధం కావాలి ఆదర్శ స్నేహబంధం
ఇట్లు..
నీ నేస్తం

**ఆర్. చందన**
*BBA final year*

11

# అమ్మ

మాటల్లో చెప్పలేని ప్రేమ అమ్మ
లోకంలో కనపడే దేవత అమ్మ

మన బాధలో తోడుండును అమ్మ
ఈ జీవితానికి అర్ధం అమ్మ

ఎన్ని జన్మలైనా తీర్చలేని ఋణం అమ్మ
అందానికి అసలు రూపం అమ్మ

సృష్టికి మూలం అమ్మ
ప్రేమకు ప్రతిరూపం అమ్మ

ఆత్మాభిమానాన్ని పెంచేది అమ్మ
నా అనే కథకు కథానాయిక  అమ్మ.

**CH. మృదుల**

*BSc బయోటెక్నాలజీ 3rd year*

12

# అన్న దాత సుఖీభవ

సూర్యుడు లేవకముందే నువ్వు లేచి
భూమే నీ తల్లి అని భావిస్తావు...
నేలతల్లిని నమ్మి సాగువాటు చేసి
వానమ్మను నమ్మి విత్తనాలు చల్లుతావు...
ఎండనక వాననక కష్టం చేసి
పుడమితల్లి వడిలో సిరులు పండిస్తావు...
అందరినీ భూమాత మోస్తూ ఉంటే
నీవు  మాత్రం భూమిని భుజాలపై మోస్తావు...
గంపెడు మెతుకులు అందరికి పంచి
గుప్పెడు మెతుకులు లేక పురుగుల మందు తాగుతావు...
అందరికి అన్నం పెట్టిన నీవు మాకు రాజు
అందుకే అంటాము "రైతే రాజు" అని...
అన్నదాత సుఖీభవ !

డి. అనూష
*BSC (Mscs), 3rd year*

13

# నాన్న

కళ్లు తెరుచుకొని ప్రేమించేది స్నేహితురాలు
కళ్లు మూసేవరకు ప్రేమించేది అమ్మ
కళ్ళలో బాధ కనపడకుండా ప్రేమించేది నాన్న
అమ్మ- నిన్ను ప్రపంచానికి పరిచయం చేస్తుంది
నాన్న; ప్రపంచానికి నిన్ను పరిచయం చేస్తాడు
జీవితం అమ్మది
జీవనం నాన్నది
నా మొదటి ప్రేమ ఎప్పటికీ మా నాన్నే

**జి.మౌనిక**
*Bsc (btzc) Final year*

14

# ఇదే నేటి సమాజ పరిమాణం

మానవ సంబంధాల మధ్య విలువ లేని కుటుంబం
న్యాయం అన్యాయం మధ్య వ్యత్యాసం తెలియని చట్టం
ప్రజల పైన గౌరవం లేని రాజకీయ సమాజం
జీవిత లక్ష్యం లేని యువతరం
ఇదే నేటి సమాజ పరిమాణం

**ఎం. మాధవి**
*BSC (MSCs) 3 rd year*

15

# అన్నయ్య

మనం సహజంగా వింటుంటాం కదా
దేవుడు అనే వాడు అన్ని చోట్ల ఉండడు అందుకే
అమ్మను సృష్టించాడు అని
అలాగే

నాన్న అనే వాడు ఎప్పుడు మనతో ఉండడు అనేమో
అన్నని సృష్టించాడు ఆ దేవుడు
కాని
నాకు ఆ అదృష్టం లేదు.
అన్న విలువ గురించి అన్న లేని వాళ్ళకే కదా
తెలిసేది
ఎప్పుడు చెల్లి బాగోగులను గురించి అలోంచించేది అన్నయ్యే కదా!

ఆ దేవుడుని కోరే కోరిక ఒక్కటే
మళ్ళీ జన్మంటూ ఉంటే నాకు అన్నయ్య ఉండేలా చూడు అని
అన్నచెల్లెలి అనుబంధం చాలా గొప్పది కదా!

**జి. నాగేశ్వరి**
*B. Com computer*

16

# అమ్మ ప్రేమ

అమ్మ అనే పదం మధురమైనది
ఆ అనుబంధం మరచిపోలేనిది
అమ్మ ఎంతో కష్టపడి ఇష్టంగా జన్మనిచ్చింది.
అంతే ఓర్పుతో అన్ని నేర్పుతుంది
నన్నేమో ముందుగా కొడుతుంది
తర్వాతేమో ఆమె ఏడుస్తుంది
అవి రెండు ఎందుకు చేస్తుందో అర్థం కాదు
కొట్టడం-నేను అల్లరి చేసినందుకట
ఏడ్వడం-నన్ను కొట్టినందుకట
అమ్మ కౌగిలించుకునేసరికి కరిగిపోయాను
ఇందాక రాని ఏడుపు ఇప్పుడు వచ్చింది
అమ్మను పట్టుకొని ఏడ్చాను
అమ్మ ముద్దుల వర్షం నాపై కురిపించింది
తను అంతులేని ప్రేమతో నన్ను ఏడిపించింది
అందుకనేమో అమ్మ అంటే నాకు చాలా ఇష్టం.

ఆర్. సాయిరామ

*Bsc MScs final year*

17

# కాలమా ఆగుమా!

కాలమా!
కాస్త ఆగుమా !
ఎవరు నేర్పారు నీకు ఈ పరుగులు ??
అలుపే ఎరగవా,
ఆయాసం నీకు దరిచేరదా,
ఎవరిచ్చారు నీకు ఈ శక్తి??
కొంచెం కనుమా ఆసక్తి
నీతో పరుగులు మాకు తగునా?
పరుగులు ఆపి నడకలు నేర్పుమా

ఎం.శృతి
*B.Com*

18

# గెలుపు

అస్తమిస్తున్న వెలుగు ఉదయించడానికి
ఆవిరవుతున్న నీరు, వర్షించడానికి
ఎండిపోతున్న కొమ్మ, చిగురించడానికి
ఓడిపోతున్న నువ్వు  గెలవడానికి.

యం. స్వర్ణ

19

# చరవాణివో, శిరోభారానివో

ప్రపంచాన్ని మరిచేలా చేస్తావు
బాహ్య బంధాలను తెంచేస్తావు
కలలో కూడా వీడనంటావు
చరవాణివో, శిరోభారానివో

20

# అమ్మ

కనిపించే దేవత అమ్మ
కనిపెంచే దేవత అమ్మ
కల్మషమే లేనిది అమ్మ
నా గుండె చప్పుడు అమ్మ.

టి. సహన
బీకాం. కంప్యూటర్స్

# ఘర్షణ

కష్టసుఖాలతో  కూడి ఉండే జీవితం
కులాలతో ఎందుకీ పంతం
మనుషులంతా కలిసి ఉంటేనేగా
ఈ కులాల పట్టింపు అయ్యేది అంతం
మనిషికీ మనిషికీ మధ్య
కులమెందుకు  అడ్డుగోడ
విడదీసే పంతం కన్నా
కలిపి ఉంచే స్నేహం మిన్న.
ఒంటరిగా వచ్చి ఒంటరిగా వెళ్ళే
ఈ జీవిత ప్రయాణంలో
కుల మతాలతో విద్వేషాలెందుకు
సాగనీయి ఈ చిన్ని ప్రయాణం
ప్రేమాభిమానాలతో..

**బి. ప్రసన్న**
బీఎస్సీ. బయోటెక్నాలజీ
3rd year

22

# చిరునవ్వు

కష్టాలు నష్టాలు ఏరులై పారనీ
సుఖాలు దుఃఖాలు వరదలై పొంగనీ
శిలా హృదయం నయన ద్వారమున  కారనీ
తుడిచేయు అన్నింటిని ఒకే ఒక చిరునవ్వుతో

**జి. నవనీత**
Bsc (Mscs)

23

# చెలిమి

రాగద్వేషాల వల్ల పెరిగేది కక్ష
స్నేహ మాధుర్యం వల్ల కలిగేది రక్ష
ప్రాణానికి ప్రాణం ఇచ్చేది నేస్తం
చేయి చేయి కలిసి చేసేది  స్నేహం
స్నేహబంధం ప్రారంభం కావడానికి
చిన్న మాట చాలు
కొన్ని  బంధాలు నిలపడానికి
ఒక చెలిమి చాలు
ప్రేమానురాగాల కలయిక స్నేహం
కులమత భేదాలు చూడనిది స్నేహం
కులమత తేడాలు లేకుండా చేసేది స్నేహం.

**బి. ప్రణతి**
Bsc. Bzc 3rd year

24

# తమ్ముడు

గులాబీకి ముళ్ళు రక్ష
చేప కి నీళ్లు రక్ష...
కంటికి కనురెప్ప రక్ష...
ఎండకి నీడ రక్ష...
వాన కి గొడుగు రక్ష...
బిడ్డకి తల్లి రక్ష...
కుటుంబానికి నాన్న రక్ష...
నా సోదరికి నేను రక్షగా
ఉంటానని
హామీ ఇస్తున్నాను..

**ఇ. రచన**
Bsc (Mscs)Final year

25

# తన పేరే ప్రేమ

మమకార ముద్దులు  కలిపి
అనురాగ ఊయల లూపి
మురిపాల లాలులు  పాడి...
మనసార నన్ను  ముద్దాడి
గండెల్లో దాచిన  అమ్మ
తన పేరే ప్రేమా...

నడకను నాకు నేర్పి
నడతను నీవు  చూపి
నా తొలి స్నేహం నీవై ...
నా తొలి పాఠం నీవై
నా తోనే నిలిచిన అమ్మ
తన పేరే  ప్రేమా...

నిలువెత్తు ఎద ఒడి అమ్మ
తీయని త్యాగం అమ్మ
నడిపించే దేవత అమ్మ
మధురాను బంధం అమ్మ
తన పేరే ... "ప్రేమ"

**డి. మాధూరి**
*బీకాం కంప్యూటర్*

26

# ధైర్యమే ఆదర్శం

తల్లి నొప్పుల కోసం భయపడ్డ రోజు
నవ సమాజం ఉండదు
సైన్యం ప్రాణాల కోసం  భయపడ్డ రోజు
ఉన్న సమాజం భద్రత కాదు
బ్రతుకు భారంగా తోచినప్పుడు
ధైర్యమే ఆదర్శం.

**ఎం అనిత**
*బీకాం కంప్యూటర్* , 3rd year

27

# నది

నా పేరు నది
నేనే అందరికీ నిధి
పల్లెల్లో పంటలకు ప్రాణం నేను
పట్టణంలోపరిశ్రమలకు శరణం నేను,
నే ఉంటే అందరికీ పూలబాట
నేను లేకుంటే అంత ఎడారి,
అదే నేనంట నా పేరే నది అంట.

**జి.నవ్య**
Bsc , MScs , 3rd year

28

# నా నేస్తం

కనుపాపగా నా కను సన్నలలో మెదులుతూ
గుండె సవ్వడిలా నాలో కదులుతూ
నా జీవితానికి తోడుగా నీడగా
నా అడుగు జాడలై
నాతో నడిచేది నా నేస్తం...

ప్రాణానికి ప్రాణమై ఉండి
ప్రాణం తీసే ప్రేమ కన్న
మనకోసం ప్రాణమిచ్చే
స్నేహబంధం ఎంతో మిన్న

నేను నీ ప్రాణ స్నేహితుడు కాకపోవచ్చు కానీ
నా ప్రాణం ఉన్నంత వరకు
నీకు ఒక మంచి నేస్తమై ఉంటాను... !
నేస్తం కంటే గొప్పదైనది
మరోకటి ఈ ప్రపంచంలో కానరాదు..

**ఎ. సుదీపిక**

29

# అమ్మ

నవమాసాలు మోసి
పురిటి నొప్పులు భరించి
నాకు జన్మనిచ్చి నా అమ్మ వైనావు
నేను చేసే చిలిపి అల్లరి
చూసి నవ్వుకొని,
నా తప్పులని సరిచేసి,
ఏది తప్పో ఏది ఒప్పో,
చెప్పి ఆది గురు వైనావు...
ఆకాశమంత విశాలమైనది నీ మనసు
ఓర్పుకి మారో  రూపం నీవు,
నీ ప్రేమ నా బలం,
నీ ప్రేమ అనన్యం...
ఓ మాతృ మూర్తి
ఏమిచ్చినా   తీర్చుకోలేను
నీ ఋణం...
నీకు మనసార నా పాదాభివందనం.

**పి. నవనీల**

*BA EPP Degree, 3rd year*

30

# నాతో -నేను

నాతో నేను ఇలా దగ్గరయ్యాను
చివరి వరకు తోడునై ఉంటాను
కలలు - కథలుగా చెప్పే ఆ రోజు కోసమై వేచిచూస్తున్న
నమ్మకం తోనే కొనసాగుతూ
ఎప్పటికైనా ఒక తారలా నిలిచి పోవాలని ఉంది.....

**కె. అర్చన**
బిఎస్సీ. బయోటెక్నాలజీ, *3rd year*

31

# నాన్న

వేలు పట్టుకొని నడక నేర్పించే వాడు నాన్న
తన భుజాల మీద ఎక్కించుకొని లోకాన్ని చూపించే వాడు నాన్న
చిన్న తప్పు చేసినా చిరునవ్వుతో బెదిరించే వాడు నాన్న
తను చద్దన్నం తిని నాకు ఉడుకు బువ్వ పెట్టేవాడు నాన్న
అమ్మ ఎంత తిట్టిన కాని వెనుకేసుకొచ్చే వాడు నాన్న

**ఆర్. ఉమ**
*బి. కామ్ జనరల్*

32

# పువ్వు

అందమైన సువాసన కలది,
వివిధ రంగులు కలిగినది,
ముళ్ళు ఉన్నా  కనబడనీయకుండా
సంతోషాన్ని పెంచేది,
దేవుని సన్నిధికి చేరుకొని
జన్మను సార్థకం చేసుకునేది
ఆడపిల్లలకు అందాన్ని తెచ్చి పెట్టేది
అలంకారంగా నిలిచేది
పరిమళంతో అందరిని ఆకట్టుకునేది
పువ్వు! దానికి సాటి ఎవరూ లేరు.

**ఎం. రవళిక**
*B.com computers (3rd year)*

33

# ప్రకృతి

గలగల పారే-సెలయేరులు
మిలమిల మెరిసే తారకలు
అందమైన పూదోటలు
హాయి గొలిపే-పిల్లల తెమ్మెరలు
ఎగసిపడే కడలి కెరటాలు
సాగిపోయె నీలిమేఘాలు
కోయిలపాటలు
వసంతాల-మట్టివాసన వర్షాలు
కొండల్లోదూకే జలపాతాలు
కోనల్లో కొలువైన అందాలు
ఇన్ని అందాలు-ఎన్నో ఎన్నెన్నో అద్భుతాలు
మన కోసం ప్రకృతి ప్రసాదించిన వరాలు.
కానీ,మనిషి కోరికలు
అవుతాన్నాయి-ప్రకృతివినాశకాలు
అందుకే, ప్రకృతిని రక్షించండి
మనిషి మనుగడను కాపాడండి.

**ఎం.అనుష**

*B.Com(Gen) 3rd year*

34

# నాన్న

"నాన్న అనే రెండక్షరాలు సరిపోవు!
నాన్న అనే పదం వర్ణించడానికి

నాన్న అనే రెండక్షరాలు సరితూగవు!
నాన్న చేసిన త్యాగాలు లెక్కించడానికి...

నాన్న అనే రెండక్షరాలు సరిపోవు!
నాన్న యొక్క వ్యక్తిత్వం వర్ణించడానికి...

నాన్న అనే రెండక్షరాలు సరిపోవు!
నాన్న నవ్వు వెనక దాగి ఉన్న బాధ్యతను తెలియజేయడానికి...

నాన్న అనే రెండు అక్షరాలు సరిపోవు!
నాన్న కలలుకంటున్న నాకు బంగారు భవిష్యత్తు ఇవ్వడానికి...

నాన్న అనే రెండు అక్షరాలు సరిపోవు!
నాన్న నాకు ఇచ్చిన ధైర్యాన్ని వివరించడానికి...

నాన్న అనే రెండు అక్షరాలు సరిపోవు!
నాన్న యొక్క కష్టాన్ని మన కవచంగా నిలిపినందుకు

నాన్న అనే రెండక్షరాల సరిపోవు!
నాన్న కలల్ని ,మరిచి మన కలని నిజం చేసిన కృషిని మరవడానికి...

నాన్న అనే రెండు అక్షరాలు సరిపోవు!
నాన్న జీవితం చదవడానికి ఒక పుస్తకం...

నాన్న నలుగుతూ మనల్ని
నడిపిస్తూ...
నాన్న కష్టపడుతూ మనకి కడుపు
నింపుతూ...
నాన్న చెమట కారుస్తూ మనకి
చిరునవ్వులు అందిస్తూ...
భుజాలపై మోస్తూ...
గుండెల్లో దాస్తూ...
లోకానికి పరిచయం చేసే వాడే నాన్న
నాన్న ఎత్తైన శిఖరం
ఓ మంచి పుస్తకం
నాన్న మన జీవనం
విజయ తిలకం
నాన్న మన నమ్మకం
ధైర్యం
నాన్న మన ప్రత్యక్ష దైవము
ఆశా ద్వీపం..!!

**బి. హారిక**
*BSC (Mscs) 3rd year*

35

# పూలతో

మల్లె పూలతో మంచి మాటలు నేర్పించినా
తామరపూలతో తియ్యని కబుర్లు చెప్పించినా
బంతి పూలతో బంధుత్వాలు పెంచినా
మందార పూలతో మనుషులను సంతోష పెట్టినా
కమలముతో కన్నీటిని ఆపినా
గన్నేరు పూలతో గమ్మత్తు కామెడీ చెప్పనా

**వి.మాధవి**
*Bsc (Mscs)*

36

# ప్రియ నేస్తమా !

ఏమైంది నీకు ఉన్నట్టుండి ఇలా ?
బాధను కూడా బయటకు అందంగా మోస్తున్నావా ?
కన్నీలను కార్చకుండా దాస్తున్నావా ?
ఎవరికి చెప్పాలో , అసలు ఎవరు వింటారో తెలియక
ఎలా దాటాలో , అసలెలా పోరాడాలో అర్ధం కాక....
పడిపోతామనే భయం
పడేలానే చేస్తుంది !
విడిపోతాను అనే భయం
విడిపోయేలానే చేస్తుంది!
ఓడిపోతాము అనే భయం
గెలుపుని కూడా  గెంటేస్తుంది !
ఆగిపోతాం అనే  భయం
అడుగు వేసే ఆలోచనని చంపేస్తుంది !
నిజాన్ని చేప్పలేని భయం  అబద్ధాన్ని అందంగా చూపిస్తుంది
పోరాడలేమనే భయం ప్రయత్నాన్ని మన ప్రయాణాన్ని
రెండిటిని ఆపేస్తుంది !
సరే పోనీ ఎం చెప్పను కాని

నీకోసం నేనున్నాని నమ్ముతావా ??
పద కలిసి నడుద్దాం అంటే కదులుతావా ??
నా పేరుకు అర్ధం ప్రశ్న ....
ఆ భయాలతో  నువ్వు వెళ్లిపోయి
నా జీవితాన్ని ప్రశ్నార్ధకం చేస్తావా ??

**బి. ప్రవల్లిక**

*BSc BZC3 year*

37

# ప్రేమతో జీవిద్దాం

ఎప్పటికైనా కలిసిపోవాలి మన్నులోనే
మరెందుకో స్వార్థం? ఇంకెందుకో పంతం?
శాశ్వతమైనది ప్రేమ ఒక్కటే
స్వార్థాన్ని వదిలేసి ప్రేమతో జీవిద్దాం.

**యం. ప్రియాంక**
*బీకాం కంప్యూటర్స్*

38

# బాధ్యత మరచిన బంధాలు

బంధాలేవి అనుభంధాలేవి..!
కాయ కష్టం చేసి చెట్టంత చేసిన కన్నోళ్లను వదిలి
మంచిగా బతుకుతామని విదేశానికి ఎగిరి
కనోళ్ళ ప్రేమానురాగాలు మరిచి
పైసా పైసా అంటూ పైసా వెనక ప్రాకులాడుతూ
కన్నోళ్లను వృద్ధాశ్రమానికి పరిమితం చేస్తూ
హాయిగా గడపాల్సిన వృద్ధాప్యాన్ని వ్యధ చేయబట్టే
ఆఖరికి కన్నోళ్ళ కట్టే కాలే నాడు కూడా రానీక యోచనచేయబట్టే!

**ఎస్. సింధు**
*B.Sc MSCs 3rd year*

39

# గురువేమిన్న

అందాల తాజమహాల్ కన్నా,
నేను చదివే కాలేజి మిన్న,
కనిపించని దైవం కన్నా,
కనిపించే గురువు మిన్న

40

# బూస్టు

నేను కొన్నాను
ఓ బూస్టు
దానికి అయ్యింది
బోలేడు కాస్ట్
ఎంతో మధురంగా ఉంది
దాని టేస్టు
నేను తిన్నాను దాన్ని
వితౌట్ వేస్టు

**వై. ధరణి**
BA.MECs, 3rd yr

41

# మధుర క్షణాలు

క్షణాలు వేగంగా
గడిచిపోతాయి
కొన్ని క్షణాలు
మాత్రమే మరచిపోలేని
మాధూరానుభూతులను
మిగులుస్తాయి
అలాంటి మాధుర
క్షణాలు,
జ్ఞాపకాల పరిమళాలు...
మన స్నేహంలో
ఎన్నో ఎన్నెన్నో!

సి.హెచ్.హైమావతి
BSc BZc

42

# లైక్

చదువగలుగు మంచి ఫాలోవరులు చాలు
పొట్టు పొట్టు లైకులు బోలెడేలా !
జెన్యూనుగ లైకు చాలదా ఒక్కటీ
పుక్కిటికి లైకులు ఎందుకు రా మామా !!

డి. నేహా
Bsc MScs

43

# కర్షకుడు

రైతు మట్టిలో బతుకుతాడు..
మనకోసం బ్రతుకుతాడు ..

మట్టిని దైవంగా కొలుస్తాడు..
పైరును ప్రాణంగా భావిస్తాడు..

తన కష్టంతో నేలను తడుపు తాడు..
నేల నుంచి సిరులు పండిస్తాడు..

వాన చుక్క కోసం పడిగాపులు కాస్తాడు..
కరువు రక్కసితో నిరంతరం యుద్ధం చేస్తాడు..

కష్టపడి  పంట సాగు చేస్తాడు..
గిట్టుబాటు ధర లేక రోదిస్తాడు..

అందరికీఅన్నం పెడతాడు..
తాను మాత్రం పురుగుల మందు సేవిస్తాడు..

నీ నవ్వు మాకు సుభిక్షం రైతన్న..
నీ కన్నీ రు మాకు దుర్భిక్షం రైతన్న ..

రైతు బ్రతుకులు మారాల్సింది చిత్రాల్లో కాదు ..
రైతు బ్రతుకులు మారాల్సింది వ్యవసాయ క్షేత్రాల్లో..

**ఎల్. బ్లెస్సీ**
*Bsc (MScs), 3rd year*

44

# విద్య

తెలివిని పెంచు విద్య
గెలుపుకి మెట్టు విద్య
సమాజంలో  గౌరవం విద్య
నీ జీవితానికి వెలుగు విద్య

విద్య లేనిదే విలువ ఇవ్వరు
విద్య లేనిదే గుర్తింపు రాదు
విద్య లేనిదే భవిష్యత్తు ఉండదు
విద్య లేని జీవితం వ్యర్థం!

డి. నేహా
B.Sc MSCs

45

# కుటుంబం

అందరు కలిసి ఉండేది కుటుంబం
అన్నిటిలో తోడు ఉండేది కుటుంబం
అన్నీ సమస్యలకు సమాధానం కుటుంబం
తెంచుకోలేని గొప్ప బంధం కుటుంబం!

ప్రేమని పంచుకునేది కుటుంబం
విలువలకు అర్థం కుటుంబం
ఆప్యాయతను పెంచేది కుటుంబం
అన్నిటికి మూలం కుటుంబం!!

**కె.సద్విని**
*బి.కామ్ కంప్యూటర్స్*

46

# విజయం

విజయం మనకు ఒకే దారిని చూపిస్తుంది..
కానీ అపజయం వంద పరిష్కారాలను అందిస్తుంది..
అందుకే పరిష్కారం లేని సమస్య గురించి చింతించకు...
పరిష్కారం ఉన్న సమస్యను వదలకు....
దారి మూసుకు పోయినప్పుడే
మరో దారి తెరిచి ఉంటుంది
దాన్ని గుర్తించినపుడు మాత్రమే
విజయం చేకూరుతుంది.....

ఎన్. రాజేశ్వరి
B.A epp 3rd year

47

# సమయాన్ని కేటాయిస్తే

పనికోసం సమయం కేటాయిస్తే
అది మనకు సంతృప్తినిస్తుంది
ఆలోచించడానికి కొంత సమయం కేటాయిస్తే..
అది మన మేధాశక్తిని పెంచుతుంది
చదవడానికి కొంత సమయం కేటాయిస్తే..
అది మన వ్యక్తిత్వాన్ని వికసింపజేస్తుంది
నవ్వడానికి కొంత సమయం కేటాయిస్తే..
అది మన జీవితాన్ని ఆహ్లాద పరుస్తుంది
ఇతరుల సేవకి కొంత సమయం కేటాయిస్తే..
అది మనకు ఆనందాన్ని ఇస్తుంది
వ్యాయామానికి కొంత సమయం కేటాయిస్తే..
అది మనకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది
ప్రార్థించడానికి కొంత సమయం కేటాయిస్తే..
అది మనకు మనశ్శాంతిని ఇస్తుంది.

**బి. శ్రావణి**
*Bsc. MScs…… Final year*

48

# స్నేహం

మనసు విప్పిమాట్లాడేది స్నేహం
కష్టసమయంలో ఆదుకునేది స్నేహం

తేనెకంటె తియ్యనిది  స్నేహం
పాలకంటే స్వచ్ఛమైనది స్నేహం

మంచుకంటే చల్లని ది స్నేహం
మల్లెకంటే తెల్లనిది స్నేహం

కల్లాకపటం ఎరుగనిది స్నేహం
మంచిని పెంచేది స్నేహం

స్నేహమేరా జీవితం
స్నేహమేరా శాశ్వతం

**ఎస్. ప్రతిమ**
BSc బయోటెక్నాలజీ 3rd year

# స్త్రీ

తానొక ఒంటరి అక్షరం అనుకుంటారు అందరూ..
శిరస్సు వంచితే అది తన సాహసం..
తాను ఆగ్రహిస్తే వదలని గ్రహణం..
ఆమే ప్రేమ పొందటం ఒక వరం
స్త్రీ ని బాధిస్తే వీడదు జన్మ జన్మలకు ఆమె శాపం..!

**బి. ధనలక్ష్మి**
BSc బయోటెక్నాలజీ 3rd year

50

# తీయనైన స్నేహం

బంధాన్ని పంచేది
అనుబంధాన్ని పెంచేది
అనురాగాల పల్లకిలో ఊరేగేది
ఆత్మీయతతో అలరించేది
మరువరానిది మరుపురానిది
తీయనిది స్నేహం

**కోకల హర్షిత**
*BBA final year*

51

# అమ్మ ఒడి

అమ్మ ఒడి చల్లనైనది..!
అమ్మ ప్రేమ కమ్మనైనది..!
అమ్మ రూపం అపురూపమైనది..!
అమ్మ దీవెన దివ్యమైనది..!
అమ్మ మది స్వచ్ఛమైనది..!
అమ్మ ఆకాంక్ష ఎనలేనిది!
అమ్మ ఋణం తీరలేనిది..!

**ఎన్. రవళిక**
బి. కామ్, 3rd year

52

# ఓ కాలమా

ఓ  కాలమా
ఆపవా నీ వేగం
నీ వేగంలో
పడి కొట్టుక పోతున్నాం కాపాడుమా,
నీ కోపానికి బలి కాకుండా దయ తలుచుమా
కాలంతో పాటు మారాలి
మనుగడ సాధించాలి.

**ఎస్. కీర్తన**
B com computers,

53

# అమ్మ ప్రేమ అనంతం

అమ్మఒడి చల్లనైనది
అమ్మ ప్రేమ కమ్మనైనది.

అపురూపమైనది అమ్మ
అందమైనది అమ్మ
ఆకాంక్ష లేనిది అమ్మ
అమ్మ రుణం తీర్చుకోలేనిది
అందుకే అమ్మ అమృతం
అమ్మ అనంతం

**జి. సౌజన్య**
*B.Com(G) 3rd year*

54

# కృష్ణ

నీవే నా తల్లివి
నీవే నా తండ్రివి
నీవే సఖుడవు కృష్ణ

నీవే నా తోడు
నీవే నా నీడ
నీవే ప్రాణము కృష్ణ

నీవే  గురువు దైవము
నీవే నా పతియు
నీవే నా గతియు కృష్ణ

నీవే గెలుపు ఓటమీ
నీవే సంతోషం భాధ
నీవే సర్వస్వము కృష్ణ

వై.శ్రేయ
*BSc, MSCS 3rd year*

## 55

# నిరీక్షణ

కంటికి కనిపించని కన్నీళ్ళు ఎన్నో
కలలుగా మారిన కళలు ఎన్నో
కఠినంగా మారిన బంధాలు ఎన్నో
కాలంతో వీటిని మరిపించేవారు ఎవరో

**కె.శ్రావ్య**
BZc *ఫైనల్ ఇయర్*

56

# అమ్మా

కనులు తెరిచిన క్షణం
కనిపించిన రూపం అమ్మ

ప్రేమ అనే పదంకి అర్ధం
నేర్పింది నాకు నీ ప్రేమ

మన మౌనం
స్పష్టంగా అర్ధం చేసుకోగల వ్యక్తి అమ్మ

మన పెదవిపై చిరునవ్వును
తన గెలుపుగా భావిస్తుంది అమ్మ

తన సర్వస్వము  త్యాగం చేసి
మన సంతోషాన్ని కోరుకుంటుంది అమ్మ

నీ ప్రేమ అమూల్యం అమ్మ
నీ రుణం తీర్చుకోలేనిది అమ్మ

కె.నాగరాణి
*BBA 3rd year*

57

# ప్రకృతి - చెప్పింది

కొవ్వొత్తి కరిగిపోతూ చెప్పింది - చివరి వరకు ఇతరులకు సహాయపడమని
జాబిల్లి వెలుగుతూ చెప్పింది - తనలాగే ఎదుటి వారిలో వెలుగు నింపమని
మెరుపు మెరుస్తూ చెప్పింది - ఉండేది ఒక్క క్షణమైనా ఉజ్వలంగా ఉండమని
పువ్వు వికసిస్తూ చెప్పింది - జీవితంలో ఒక్కరోజైనా గౌరవంగా జీవించమని
వృక్షం చల్లగా చెప్పింది - తనలాగే కష్టాల్లో ఉన్న ఇతరులకు నీడని ఇవ్వమని
ఏరు జలజలా పారుతూ చెప్పింది - తనలాగే కష్టసుఖల్లో చలించకుండా గమ్యం వైపు సాగమని

నది ప్రవహిస్తూ చెప్పింది - తన లాగే ఎదుటి వారి దాహాన్ని తీర్చమని
అస్థమిస్తున్న సూర్యుడు చెప్తున్నాడు - రేపన్నది ఉధయించడానికేనని,
ఎన్ని సమస్యలున్నా ముందుకి సుర్యునిలా సాగమని
సుత్తి దేబ్బ తింటున్న శిల చెప్తుంది - దేబ్బ తగలనిదే ఏది సాధించలేమని,
కష్టాలు పడనిదె జీవితం అంటే ఏమిటో తెలియదని

రైతు చెప్తున్నాడు - నేను శ్రమించనిదే నీ కంచంలో మెతుకులు ఉండవని
గడియారం చెప్తుంది - కాలమే జీవితమని, కాలం వృథా చెస్తే నీ జీవితాన్ని నువ్వే వృథా చేసుకోవడమని

కాలుష్యమవుతున్న ప్రకృతి చెప్తుంది - మీరు హాతమారుస్తున్నది నన్ను కాదు మీకు మీరేనని!

**ఎన్. లక్ష్మీ**
*BSc (MSCs)*